TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 59 | బుధవారం, జూన్ 12, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4



2వ పేజీలో...

## కంచుకోటలోనూ

# బీఆర్ఎస్ ఢమాల్

**ఉత్తర తెలంగాణలోనూ తుడిచి పెట్టుకు పోయిన పార్టీ ఇప్పటికిప్పుడు కోలుకోవడం అంత సులవు కాదు**

కరీంనగర్,: ఉత్తర తెలంగా ఎప్పుడూ బిఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. మెదక్ ఇక చెప్పాల్సిన పనిలేదు. అయితే బిఆర్ఎస్ స్వయంకృతం కారణంగా ఆ పార్టీ ఎక్కడా ఉనికి లేకుండా పోతోంది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను చూస్తే..ఇక బిఆర్ఎస్‌కు నూకలు చెల్లాయనే చెప్పాలి. మరో ఐదేళ్ల వరకు దానికి భవిష్యత్ లేనట్లుగానే భావించాలి. నిజానికి కరీంనగర్ బీఆర్ఎస్‌కి కంచుకోట. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ప్రతి ఎన్నికలో సత్తా చాటింది. అంతే కాకుండా కరీంనగర్‌ని, బీఆర్ఎస్‌ను విడదీయలేని పరిస్థితి. ఇక్కడ నెగ్గితే తెలంగాణ అంతా పాజిటివ్ ఫలితాలు వస్తాయనే సెంటిమెట్ ఉండేది. 2019 ఎన్నికల నుంచి బీఆర్ఎస్ కంచుకోటకి బీటలు వారుతున్నాయి.



2వ పేజీలో...

## నేటి చంద్రబాబు ప్రమాణానికి

# మోడీ రాక

- మోడీతో పాటు అమిత్ షా పర్యటనా ఖరారు
- మోడీ రాకతో భారీగా బందోబస్తు ఏర్పాటు
- పలువు ఎన్‌డిఎ పాలిత సిఎంల రాక
- తెలంగాణ సిఎం రేవంత్‌కు ఆహ్వానం లేనట్లే

అమరావతి, : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఖరారైంది. ఈనెల 12న కేసరపల్లి ఐటి పార్కు ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరు కానున్నారు. 12వ తేదీ ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 10.55 గం.లకు అక్కడ నుంచి ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11 నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ బయల్దేరి వెళ్తారు. మోదీ పర్యటన నేపథ్యంలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. కాగా సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీతో పాటు, హోం మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. సాధారణంగా ఏదైనా కార్యక్రమానికి మోదీ, అమిత్‌షాల్లో ఒకరు మాత్రమే హాజరు అవుతుంటారు. కానీ దీనికి మాత్రం ఇద్దరూ వస్తున్నారు.




2వ పేజీలో...

## నేడు టెట్ ఫలితాల

# విడుదల

**అధికారిక వెబ్‌సైట్లో పెట్టనున్న విద్యాశాఖ**

హైదరాబాద్, : తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫలితాలు జూన్ 12న బుధవారం విడుదల కానున్నాయి. టీచర్ పోస్టుల కోసం ఎదరుచూస్తున్న అభ్యర్థులు టెట్ ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టెట్ రాసిన అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో మే 20 నుంచి జూన 2 వరకు టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొదటి సారిసగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు.




2వ పేజీలో...

## నీట్ పరీక్ష రద్దు చేయడం

# కుదరదు

**దానికున్న ప్రతిష్టను దెబ్బతీయడమే అవుతుంది**
**నీట్ అక్రమాలపై పిటిషన్‌ను విచారించిన సుప్రీం**
**విచారణను జూలై 8కి వాయిదా వేసిన ధర్మాసనం**

న్యూఢిల్లీ, : వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ – 2024 పరీక్షలో అవతవకలు జరిగినట్లు గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న క్రమంలోనే నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. పరీక్షను రద్దు చేయడం అంత సులువు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇది మీరు అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. ఇక, ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా ఎన్‌టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది. ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ –2024 ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. అయితే తొలుత జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పి.. అంతకంటే ముందే ఓట్ల లెక్కింపు జరుగుతుండగా విడుదల చేయడం వివాదానికి దారితీసింది. ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది.



## విద్యుత్ కొనుగోళ్ల

# దర్యాప్తు

**కెసిఆర్‌కు నోటీసులు జారీ**

హైదరాబాద్, : తెలంగాణలో విద్యుత్ కొనుగోళ్ల అంశంలో దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ క్రమంలో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. యాదాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ కరెంటు కొనుగోలుకు గత ప్రభుత్వం అనుసరించిన విధానంపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ నరసింహారెడ్డి జ్యుడిషియల్ కమిషన్ విచారణ కొనసాగుతోంది.

2వ పేజీలో...




2వ పేజీలో...

## గ్రామ పురోగతిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలి

**-వాషింగ్టన్ డీసీలో మీట్ అండ్ గ్రీట్**
**- పాల్గొన్న తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**మంథని, జూన్ 11:** ప్రవాస భారతీయులు పుట్టిన ఊరుకు మేలు చేసే విధంగా గ్రామ పురోగతిలో భాగస్వాము లు కావాలని తెలంగాణ ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకోరారు.






## ప్రైవేట్ స్కూళ్లను నియంత్రించే

**అధిక ఫీజులపై నోరు మెదపని ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్న స్కూళ్లు**

# చర్యలేవీ ?

విజయవాడ, : ఫీజులు పెంచినా కిక్కురుమనకుండా పిల్లలను స్కూల్లో చేర్పిస్తున్నారు. ఇలా చేయడం ప్రైవేట్ స్కూళ్ల యాజామాన్యాలకే బాగా తెలుసు. ఎక్కడ డబ్బులు ఎలా రాబట్టాలో వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ప్రభుత్వాలు కూడా ఇంతవరకు వారిని ఏమీ అనడం లేదు.




2వ పేజీలో...

## జనసేన శాసనసభాపక్ష నేతగా

# పవన్ కళ్యాణ్

**ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు**

అమరావతి:జనసేన శాసనసభ పక్ష నాయకుడిగా పవన్ కల్యాణ్ఎన్నికయ్యారు. మంగళవారంఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన శాసనసభ పక్ష సమావేశం నిర్వహించారు. తెనాలి ఎమ్మెల్యే నాదెండ్లమనోహర్ ఈ సమావేశంలో జనసేన శాసనసభ పక్ష నాయకుడిగా పవన్‌ను ప్రతిపాదించారు



## ఎన్ కౌంటర్లతో ఏజెన్సీలో

# భయం.. భయం..

వరంగల్, : తెలంగాణ–ఛత్తీస్గడ్ రాష్ట్రాల సరిహద్దు ములుగు జిల్లా ఏజెన్సీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు పార్టీ మందు పాతరలు దడ పుట్టిస్తున్నాయి. ఇప్పటికే మందుపాతర పేలి ఓ వ్యక్తి చనిపోగా..వరుసగా మావోయిస్టుల మందుపాతరలు పోలీసులు వెలికితీసి నిర్వీర్యం చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎక్కడ.. ఎప్పుడు ఇలాంటి పేలుడు వార్త వినాల్సివస్తుందో.. ఆ బాంబులు ఎవరిని బలి తీసుకుంటాయో అని హడలెత్తిపోతున్నారు. పోలీసులు ? మావోయిస్టుల మధ్య ఆధిపత్య పోరులో సామాన్యులు నలిగి పోతున్నారు. మావోయిస్టుల ఉనికే లేకుండా చేయడం కోసం పోలీసులు అస్త్రశస్త్రాలతో అడవులను జల్లెడ పడుతున్నారు

2వ పేజీలో...

# ప్రైవేట్ స్కూళ్లను నియంత్రించే చర్యలేవీ ?




మొదటిపేజీ తరువాయి...

స్కూళ్ల ప్రారంభానికి ముందే ఫీజులను వసూలు చేసుకున్నారు. కొన్ని స్కూళ్లు ఫీజులను వసూలు చేశాక మెల్లగా నెలాఖరు వరకు ఆన్‌లైన్ క్లాసులంటూ.. విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పారు. బడిబాట పేరుతో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూళ్ల పై నియంత్రణ కోల్పోయాయి. ఎందకంటే వారిచ్చే ఆమ్యామ్యాలే వారికి ముఖ్యం కనుక వారిపై ఈగ వాలదు. నిజానికి వారు మన చట్టం పరిధిలో ఉన్నారా అన్న అనుమానాలు కూడా కలగమానదు. ఇక సర్కార్ బళ్లల్లో ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యలు ఉండనే ఉన్నాయి. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కెజి టూ పిజి అన్న ప్రతిపాదన కోల్డ్ స్టోరేజీకి వెళ్లింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంగ్లీష్ మాధ్యమం పేరుతో హడావిడి చేస్తున్నా...బోధనోపాధ్యాయుల నియామకం జరగలేదు. అలాగే పుస్తకాల ముద్రణ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. తెలుగు మీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అన్న చర్చ సాగింది. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అన్న మౌళిక ప్రశ్నలు వచ్చాయి. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? అని వేస్తున్న ప్రశ్నలకు సమాధానం రావడం లేదు.

అయితే అందుకు అనుగుణంగా బోధనా సిబ్బందిని,మౌళిక వసతులను కల్పిస్తే ఎవరూ కాదనరు. అలాగని తెలుగును నిర్లక్ష్యం చేయరాదు. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. అయితే ఇంగ్లీష్ మీడియం ప్రకటించడానికి ముందు ఆ మేరకు స్కూళ్లను, తయారు చేసి టీచర్లను నియమించాల్సి ఉంది. ప్రకటనలు బాగున్నా ఆచరణలో పక్కా ప్రణాళిక ఉండాలి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట లేకుండా చేయాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదాయాలు నిలబడతాయని నిపుణుల అభిప్రాయం. అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభా గల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృ భాషలోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమంలోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాష లోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చుకోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీ భాషలు నేర్పితే సరిపోతుంది. ఇంగ్లీషు భాషలో అర్థం చేసుకోవడం కష్టం. ఇంగ్లీషు తెలియని ఇళ్ళు, సమాజం నుండి వివరణ అడిగి తెలుసుకునే అవకాశం తక్కువ.

అందువలన ప్రాథమిక విద్యా స్థాయిలో... ఆంగ్ల మాధ్యమం లో విషయ పరిజ్ఞానం, జ్ఞాన సంపాదన కష్టం. పైగా పేదలు తమ పిల్లలకు డబ్బు పెట్టి ట్యూషన్‌కు పంపించలేరు. టీచర్లను పెట్టి చదివించుకోలేరు. అన్ని విధాలా పేదల పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో నష్టపోవడం ఖాయం. డబున్న వాళ్లకు అన్ని అవకాశాలు వుంటాయి గనుక ఏ మాధ్యమ మైనా ఫర్వాలేదు. ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదంగా..దేశంలో జాతీయోద్యమంగా సాగాలి. ముందు ప్రైవేట్ స్కూళ్లపై అజమాయిషీ చేయాలి. డబ్బులు గుంజే విధానాన్ని అరికట్టాలి. వారు చట్టానికి లోబడి ఉండేలా చూడాలి. అంతేగాని వారిని పట్టించుకోకుండా.. వసూళ్లు చేసుకునేలా ప్రోత్సహించడం అరాచకం తప్ప మరోటికాదు. ఫీజుల నియంత్రణపై వేసిన కమిటీలు ఇచ్చిన సూచనలు బుట్టదాఖలు చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ప్రభుత్వాలు ప్రజల పక్షాన ఆలోచించేలా తప్ప యాజమాన్యాల పక్షాన కాదని గుర్తించాలి. ఈ విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. బోధానా సిబ్బందిని నియమించి, మౌళిక వసతులు కల్పిస్తే ప్రజలు తప్పకుండా సర్కార్ బడులనే ఆశ్రయిస్తారు.

# ఎన్ కౌంటర్లతో ఏజెన్సీలో భయం.. భయం..

మొదటిపేజీ తరువాయి...

ములుగు జిల్లా ఏజెన్సీలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో క్షణక్షణం టెన్షన్ వాతావరణం నెలకొంటుంది. ఈనెల 3వ తేదీన కొంగాల గుట్టపై మావోయిస్టులు అమర్చిన ట్రాప్ బుజీ పేలి యేసు అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత మావోయిస్టులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి ఇప్పటికి గ్రామాల్లో నిరసనలు కంటిన్యూ అవుతున్నాయి . మరోవైపు మావోయిస్టులు కూడా మందు పాతర పేలుళ్లపై లేఖవిడుదల చేశారు. తమ డెన్నులను కనిపెట్టడం కోసం ఇన్ ఫార్మర్లను అడవిలోకి పంపి పోలీసులే వారి చావుకు కారణం అవుతున్నారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. మందుపాతర పేలు చనిపోయిన ఏసు కూడా పోలీసుల డైరెక్షన్లోనే అడవిలోకి వచ్చి మందు పాతరలకు బలయ్యాడని లేఖ విడుదల చేశారు. అంతేకాదు ఈ ప్రాంతంలో చాలా మందు పాతరలు ఉన్నాయని మా ఆత్మరక్షణ కోసం మందుపాతరలు అమర్చామని మావోయిస్టులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మందు పాతరలు ఏజెన్సీ ప్రజలు ఆడలెత్తిపోయేలా చేస్తున్నాయి. ఎప్పుడు.. ఎక్కడ ఇలాంటి పేలుడు వార్త వినాల్సి వస్తుందో..! ఆ పేలుళ్లు ఎవరిని బలి తీసుకుంటాయో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

అయితే మందు పాతరలను నిర్వీర్యం చేయడం కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. ఇటు రహదారుల వెంట అమర్చిన మందు పాతరలతో పాటు అడవుల్లో అమర్చిన మందు పాతరాలను కూడా వరుసగా నిర్వీర్యం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం జగన్నాధపురం గ్రామ సమీపంలోని చలిమెల అడవుల్లో ఒక ల్యాండ్ మైన్ నిర్వీర్యం చేశారు. తాజాగా జగన్నాథపురం గ్రామ శివారులో రహదారి పక్కనే మరో మందుపాతర గుర్తించి నిర్వీర్యం చేశారు. ఆ ప్రాంతమంతా బాంబ్ డిస్పోస్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచిస్తున్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పు తేవద్దని హెచ్చరిస్తున్నారు.

# కంచుకోటలోనూ బిఆర్ఎస్ ఢమాల్

మొదటిపేజీ తరువాయి...

తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికలలో కనీసం పోటీ కూడా ఇవ్వకుండా మూడవ స్థానానికే పరిమితం కావడం గమనార్హం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గులాబీ పార్టీ అనుకూల ఫలితాలు సాధించింది. తెలంగాణ ఉ ద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికలలో గులాబిజెండా రెపరెప లాడింది. లంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికలలో క్లీన్‌స్వీప్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో తొంభై ఐదు శాతానికి పైగా ఫలితాలు సాధించింది. ఈజిల్లాలో బీఆర్ఎస్‌కు ఇక తిరుగులేదన్న సమయంలో 2019 ఎన్నికలలో బిఆర్ఎస్ కి మొదటిషాక్ తగిలింది. తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికలలో అనుకూలమైనా ఫలితాలు సాధించలేక పోయింది. కనీసం ఎంపి ఎన్నికలలో గట్టి పోటి ఇస్తామని నేతలు భావించారు, ఈ ఎన్నికలతో పార్టీ బలోపేతం అవుతుందని అంచనాలు వేసుకున్నారు. పోటి మాట ఏమో గాని మూడవస్థానానికే పరిమితమై బిఆర్ఎస్ శ్రేణులను తీవ్ర నిరాశకి గురి చేసింది. రాష్ట్రంలో ఒకటో రెండో సీట్లు బిఆర్ఎస్ గెలిస్తే అది కరీంనగర్‌లోనే గెలుస్తుందని నేతలు భావించారు. కానీ వ్యతిరేక ఫలితాలు వచ్చాయి?ఇక్కడ పార్టీ గట్టిగా ఉన్న కనీసం రెండవ స్థానంలో కూడా నిలబడలేదు. కరీంనగర్ పార్లమెంటు ఫరిధిలో ఏడు అసెంబ్లీలలో ఎక్కడ కూడా లిడ్ ఇవ్వలేక పోయింది?.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిరిసిల్లలో కూడా లీడ్‌ఇవ్వలేక పోయింది. ఇక్కడ మాత్రం రెండవస్థానంలో నిలిచి ంది..మరో మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న కరీంనగర్ అసెంబ్లీలో కనీస ఓట్లు కూడా సాధించలేక పోయింది. మూడవస్థానానికే పరిమితం అయ్యింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్న హుజురాబాద్ లోకూడా మూడవస్థానానికే పరిమితం అయ్యింది. ఒకప్పుడు క్యాడర్,లీడర్ లతో బలంగా ఉన్న బిఆర్ఎస్ ఇప్పుడు మూడవస్థానానికే పరిమితం కావడంతో క్యాడర్ అంతా అయోమయా నికి గురి అవుతుంది. అయితే ఇది తాత్కలిక అపజయమేనని,స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా ఏమిటో చూపిస్తామని బిఆర్ఎస్ నేతలు అంటున్నారు. అయితే దీనితో ఒరిగేదేమీ ఉండబోదు.

# గ్రామ పురోగతిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలి

మొదటిపేజీ తరువాయి...

గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జిటిఏ) ఆధ్వర్యంలో వాషింగ్టన్ డీసీలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కేరళలో ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు విజయవంతంగా నడుస్తుందని అంతకన్నా గొప్పది అతి త్వరలో తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దపల్లి జిల్లాలో త్వరలో 1000 కోట్లతో కోకకోల మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూతపడిన నిజాం సుగర్ ఫ్యాక్టరీని ఏడాదిలోగా తెరిచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.చెరుకు రైతులకు మేలు చేయడంతో పాటు ఆ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. హైదరాబాద్ లోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర నలుమూలల ఫైబర్ నెట్వర్క్ అందుబాటులో ఉందన్నారు. ప్రవాస భారతీయులు పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలన్నారు. హైదరాబాద్ నగరానికి పరిమితం కాకుండా పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ విస్తరణకు తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.హైదరాబాద్ ను ఏఐ క్యాపిటల్ గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్(జిటిఏ) ఛైర్మన్ విశ్వేశ్వర్ తో పాటు 6టివి చైర్మన్ సురేష రెడ్డి, జిటిఏ ట్రెజరర్ సుధీర్ ముద్దసాని, బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమరేంద్ర నంది, వాషింగ్టన్ డీసీ ఉపాధ్యక్షులు కొట్య బానోత్ పాల్గొన్నారు.

# జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్ కళ్యాణ్

మొదటిపేజీ తరువాయి...

ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 164 సీట్లు సాధించిన విషయం తెలిసిందే. కూటమిలో భాగమైన జనసేన 21 సీట్లు గెలుచుకుంది. అయితే ఈ నెల 12వ తేదీన ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్రబాబుతో పాటు మరికొంతమంది కూటమి ఎమ్మెల్యేలు కూడా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. జనసేన నుంచి 4 మంత్రి పదవులను అడుగుతారని తెలుస్తోంది. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవి ఖరారైనట్టు సమాచారం. తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు సైతం మంత్రి పదవి దక్కనుందని టాక్. అయితే సోషల్ మీడియాలో మరో రెండు పేర్లు కూడా ప్రచారంలో ఉ న్నాయి. వాటిలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌లను మంత్రులుగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని జోరుగా ప్రచారం జరుగుతోంది. జనసేన కేంద్ర కార్యాలయంలో సోమవారం పవన్ కళ్యాణ్ కీలక నేతలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై పవన్ చర్చించారు. మంత్రి వర్గంలో పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఎవరనే దానిపైనా చర్చించినట్టుగా తెలుస్తోంది.

# నేటి చంద్రబాబు ప్రమాణానికి మోడీ రాక

మొదటిపేజీ తరువాయి...

ఎన్డీయే కూటమిలో టీడీపీ అధినేత ప్రాధాన్యానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు. మరి కొందరు కేంద్ర మంత్రులు, పొరుగు రాష్ట్రాల సీఎంలు కూడా హాజరవుతున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. తమిళనాడు నుంచి కొందరు మంత్రులతో ఒక సౌహార్ద ప్రతినిధి బృందం హాజరవు తోంది. పోయినసారి జగన్మోహన రెడ్డి ప్రమాణ స్వీకారానికి అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్, తమిళనాడు సీఎం స్టాలిన్ హాజరయ్యారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానాలను ఎన్డీయే కూటమి సీఎంలకే పరిమితం చేయడంతో పొరుగు రాష్ట్రా ముఖ్యమంత్రులు రావడం లేదు. ఈ క్రమంలో తెలంగాణ సిఎం రేవంత్‌కు కూడా ఆహ్వానం పంపకపోవచ్చని తెలుస్తోంది. ప్రమాణస్వీకార వేదికను బాగా విశాలంగా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు ఏభై వేల మంది కూర్చోవడానికి వీలుగా మైదానంలో కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతకు మించి వచ్చిన వారు ప్రాంగణం బయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వారి కోసం ప్రాంగణం బయట డిజిటల్ తెరలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ జిల్లాల్లో వస్తున్న స్పందనను బట్టి ఈ సభకు సుమారుగా లక్ష నుంచి లక్షన్నర మంది హాజరు కావచ్చునని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పది వేల వాహనాలు రావచ్చునన్న లెక్కతో వాటికి సరిపోను పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక అతిథులుగా జగన్ బాధితులు హాజరవుతున్నారు. జగన్ ప్రభుత్వంలో వేర్వేరు కారణాలతో బాధితులుగా మారిన 112 మందిని గుర్తించి, వారికి ప్రత్యేకంగా ఆహ్వానాలు పంపించారు. కర్నూలు జిల్లాలో పోలీసులు వేధిస్తున్నారంటూ కుటుంబంతో సహా సామూహికంగా ఆత్మహత్య చేసుకున్న అబ్దుల్ సలాం బంధువులను ఈ కార్యక్రమం కోసం పిలిచారు. అలాగే, ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ చేసిన దళిత డ్రైవరు సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు ఆహ్వానం అందింది. కరోనా సమయంలో మాస్కులు అడిగిన నర్సీపట్నం డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు సర్కార్ కారణమైంది. ఆయన కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# నీట్ పరీక్ష రద్దు చేయడం కుదరదు

మొదటిపేజీ తరువాయి...

ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యం లో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

# కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్తల ద్వారా ప్రదర్శన క్షేత్రం



రామడుగు: కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్తలు వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ వారి సంయుక్తంగా వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో మంగళవారం వెధిర గ్రామంలో న్యూమాటిక్ ప్లాంటర్ యంత్రం ద్వారా అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి విత్తె విధానంపై ప్రదర్శన నిర్వహించారు. ఈ పద్ధతిలో విత్తడం కోసం ఎంపిక చేసిన ప్రత్తి వంగడాలను న్యూమాంటిక్ ప్లాంటర్ ద్వారా వరుసకు వరుసకు మధ్య దూరం 3 ఫిట్ లు మొక్క మొక్కకు మధ్య దూరం 1/2 ఫిట్టు వచ్చే విధంగా ఒక ఎకరాకు 5-6 ప్యాకెట్లు అవసరం ఉంటుందని రైతులకు వివరించారు. అదేవిధంగా ఈ పద్ధతి ఎక్కువగా చలుక భూములకు ఇసుక భూముల్లో వర్షాధారంగా సాగుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ మంజులత కెవికె హెడ్ ఎన్ వెంకటేశ్వరరావు శాస్త్రవేత్తలు మధుకర్ మదన్మోహన్ విజయ్ ఏడిఏ అంజని వ్యవసాయ విస్తరణా అధికారులు టి సంపత్ కె రమేష్ జి సంపత్ ప్రొఫెషనల్స్ వై రాజేష్ పి రాజేష్ వేద కంపెనీ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

# విద్యుత్ కొనుగోళ్ల దర్యాప్తు

మొదటిపేజీ తరువాయి...

ఈ అంశంలో కేసీఆర్, సురేశ్ చందా, అజయ్ మిశ్రా సహా 25 మందికి నోటీసులు ఇచ్చినట్లు జస్టిస్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. వివరణ ఇచ్చేందుకు కేసీఆర్ జులై 30 వరకు సమయం అడిగారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో.. పదేళ్లు సీఎంగా ఉన్న సమ యంలో విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాలకు సంబంధించిన విషయాల పై.. మీ పాత్ర ఏంటో చెప్పాలంటూ పవర్ కమిషన్ నోటీసులు జారీ చేసింది.2024, జూన్ 30వ తేదీలోపు కేసీఆర్ సమాధానం ఇవ్వాలం టూ నోటీసుల్లో స్పష్టం చేసింది పవర్ కమిషన్. దీనిపై కేసీఆర్ బృందం స్పందించిందని.. జూలై 30వ తేదీలోపు సమాధానం ఇవ్వటానికి సమయం కావాలని కేసీఆర్ కోరినట్లు కమిషన్ వెల్లడించింది. జూన్ 30వ తేదీలోపు సమాధానం చెప్పాలని కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ ఇచ్చే సమాధానం సంతృప్తిగా లేకపోతే ప్రత్యక్ష విచారణకు పిలుస్తామని కమిషన్ వివరించింది. జూన్ 30వ తేదీలోపు లిఖితపూర్వక సమాధానం ఇవ్వాల్సి ఉంది కేసీఆర్.. ఆ సమాధానంపై కమిషన్ సంతృప్తి చెందకపోతే.. నేరుగా విచారణకు కేసీఆర్ హాజరుకావాల్సి ఉంటుంది . భద్రాద్రి, యాదాద్రి, ఛత్తీస్ ఘడ్ విద్యుత్ ఒప్పందాలపై అప్పటి సీఎంగా కేసీఆర్ పాత్రపై ఉన్న అనుమానాలు, లోగుట్టుపై ఉ న్న సందేహాలకు కేసీఆర్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# ఆర్థిక రాజధానిగా విశాఖ

విజయవాడ,: ఏపీలో విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అలాగే విశాఖను ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతామని, కర్నూలును కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్డీఏ శాసనసభ పక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఏపీ ప్రజలు గతంలో ఎప్పుడూ ఇవ్వని తీర్పునిచ్చారని, ఏపీ ప్రజలు ఐదేళ్లు విధ్వంసకర పాలన చూశారని, అత్యున్నత ఆశయాల కోసం 3 పార్టీలు ఏకమయ్యాయని అన్నారు.1994లో ఏకపక్ష ఎన్నికలు జరిగినా ఇన్ని సీట్లు రాలేదని, చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కడపలో 7కు 5 సీట్లు గెలిచాం.. అభ్యర్థులు గట్టిగా నిలబడ్డ చోట ప్రజలు ఆశీర్వదించారు.

ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఢిల్లీలో మమ్మల్ని గౌరవించారని చంద్రబాబు అన్నారు. ఈ తీర్పుతో రాష్ట్ర గౌరవం పెరిగింది.. గెలిచే అభ్యర్థులకే సీట్లు కేటాయించాం.. టీడీపీ, జనసేన పొత్తు గురించి తొలిసారి చెప్పిన వ్యక్తి పవన్ అని గుర్తు చేశారు చంద్రబాబు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లు ఏపీ ప్రజలు విపత్కర పరిస్థితులు చూశారని, ఏపీలో ఎన్డీఏ కూటమి విజయం దేశానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. కూటమి అంటే ఎలా ఉండాలో ఏపీ ప్రజలు దేశానికి చూపించారన్నారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం, కావల్సిన చోట తగ్గాం.. 5 కోట్ల మంది ప్రజలు మనపై ఆశలు పెట్టుకున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో సుదీర్ఘమైన అనుభవం ఉన్న నాయకుడు కావాలని, ఈ సమయంలో చంద్రబాబు నాయకత్వం, అనుభవం చాలా అవసరం అని పవన్ అన్నారు. మందుపాతరలు పేలినా బయటపడ్డ నాయకుడు చంద్రబాబు.. ఎన్డీఏ కూటమి నుంచి ముఖ్యమంత్రిగా చంద్రబాబును ప్రతిపాదిస్తున్నామని పవన్ కల్యాణ్ ప్రకటించారు.

# ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలి

-పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శన్

ప్రజాక్రాంతి, పెద్దపల్లి ప్రతినిధి:ప్రజలు తమ విద్యుత్ బిల్లులను ఆన్ లైన్ ద్వారా సైతం చెల్లించవచ్చని పెద్దపల్లి విద్యుత్ శాఖ సూపరింటెం డెంట్ ఇంజనీర్ బొంకురి సుదర్శన్ మంగళవారం తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పెద్దపల్లి సర్కిల్ పరిధిలో ఆన్ లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజురోజుకు గణనీయంగా పెరుగుతుందని, సాంకేతికతంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్ లైన్ చెల్లింపులను టీజీఎన్పీడీసీఎల్ సులభతరం చేసిందన్నారు. టిజి ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, వెబ్ సైట్ గూగుల్ పే , ఫోన్ పే , పేటియం ద్వారా నెల వారీ విద్యుత్ బిల్లులు ఆన్ లైన్ లో చెల్లింపు చేయ వచ్చుని, గంటల తరబడి లైన్ లో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించే దాని కంటే కేవలం రెండు నిమిషాల వ్యవధిలో మీ జూఅ నెంబర్ ను నమోదు చేసి చిటికెలో మీ బిల్లులు చెల్లింపు చేసుకోవచ్చన్నారు. మే నెలలో 54360 వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా రూ. 8 కోట్ల 5 లక్షల 43 వేల మొత్తాన్ని చెల్లించారని, ప్రతి నెల ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు 20 శాతం పెరుగుతుందని అన్నారు. విద్యుత్ బిల్లుల కేంద్రాలకు వెళ్లకుండా కేవలం ఆండ్రాయిడ్ ఫోన్ తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చుని, తద్వారా చెల్లింపు సులభతరం అవుతుందని, కట్టిన డబ్బుల పూర్వ వివరాలు కూడా తెలుసుకోవచ్చని, రసీదు కూడా పొందటం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లు పైనే క్యూ ఆర్ కోడ్ ను ముద్రించడం జరుగుతుందని మొదట ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్ ) గా వరంగల్ సర్కిల్ కేంద్రంలో మట్టెవాడ ఈఆర్ఓ పరిధిలో ప్రారంభించడం జరిగిందని, త్వరలో పెద్దపల్లి సర్కిల్ లో కూడా ప్రారంభి స్తామని అన్నారు.మీకు అందించే బిల్లుపైనే క్యూ ఆర్ ముద్రించడం జరుగుతుందని ఆ క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా మీ బిల్లు తాలూక సంబంధించిన వివరాలు, చెల్లించ వలసిన మొత్తం కనపడుతుందని తద్వారా వినియోగదారులు అట్టి మొత్తాన్ని చెల్లించవచ్చని అన్నారు.

## సంపాదకీయం

బుధవారం, జూన్ 12, 2024

# అసమాన వ్యంగ్య చిత్రకారుడు

రాజకీయ కార్టూనులు వేస్తూ, ప్రముఖ వార్తా పత్రికలలో పనిచేస్తూ, అదే వృత్తిగా ఎంచుకుని, స్వతంత్రంగా, నిర్భీతిగా పని చేసిన వ్యంగ్య చిత్రకారులు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అందులో అబూ అబ్రహం ముఖ్యులు. ఒక కార్టూనులో ఒక పాత్రను ప్రవేశపెట్టి, ఆ పాత్రబొమ్మను అదేవిధంగా దశాబ్దాల పాటు వేయగల శక్తి ఉన్న అతి కొద్దిమంది కార్టూనిస్టులలో అబూ ఒకరు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ అబ్జర్వర్ పత్రికకు అబూనే మొట్ట మొదటి రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు కావడం విశేషం. సామాన్యంగా ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా, అబూ అబ్రహం బయటి దేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారత్ కు తిరిగి రావటం జరిగింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని తన మూడవ ఏట నుండే బొమ్మలు గీయటం మొదలు పెట్టారు. చదువుకునే రోజులలో తమ గురువుల బొమ్మలు కూడా వేసే వారట. అత్తుపురథు మాథ్యూ అబ్రహామ్ (11 జూన్ 1924- 1 డిసెంబర్ 2002), అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రఖ్యాత భారతీయ వ్యంగ్య చిత్రకారుడు, పాత్రికేయుడు, రచయిత. ఆయన కలం పేరు అబూ. ఆయన హేతువాది, నాస్తికుడు. అబూ తన 40 యేళ్ల సుదీర్ఘ వృత్తి జీవితంలో అనేక జాతీయ, అంతర్జాతీయ వార్తా పత్రికలలో పనిచేశారు. "బాంబే క్రానికల్", "శంకర్స్ వీక్లీ", "బ్లిట్జ్", "ట్రిబ్యూన్", "ది అబ్జర్వర్", "ది గార్డియన్", "ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్" తదితర పత్రికలలో పని చేసి గుర్తింపు పొందారు. అబూ కేరళ రాష్ట్రంలోని మవేలికర గ్రామంలో ఎ.ఎం.మాథ్యూ, కాంతమ్మ దంపతులకు జన్మించారు. తన మూడవ యేటి నుండే బొమ్మలు గీయడం మొదలు పెట్టారు. తిరువనంత పురం యూనివర్సిటీ కాలేజీలో ఫ్రెంచి, గణితం, ఇంగ్లీషు ఐచ్ఛికాంశాలుగా 1945లో డిగ్రీ పూర్తి చేశారు. ఇతడు విద్యార్థి దశలో టెన్నిస్ ఛాంపియన్‌గా ఉండేవారు. చదువు ముగిసిన వెంటనే అబూ బొంబాయి వెళ్లి "బాంబే క్రానికల్" పత్రికలోను, దాని సోదర పత్రిక "ది బాంబే సెంటినెల్"లోను జర్నలిస్ట్‌గా చేరారు. "బ్లిట్జ్", "భారత్" పత్రికలలో కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. 1951లో ప్రముఖ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్ళై అబూను తన ''శంకర్స్ వీక్లీ''లో పనిచేయ వలసిందిగా ఢిల్లీకి ఆహ్వానించారు. 1953లో లండన్‌లోని "ది స్టార్" పత్రిక సంపాదకుడు ఫ్రెడ్ జోస్ ఇతడిని లండన్‌కు రావలసినదిగా ప్రోత్సహించారు. ఆయన తన 32వ యేట లండన్‌లో అడుగు పెట్టారు. లండన్ చేరిన వెంటనే అబూ పంచ్, డైలీ స్కెచ్, ఎవెరీబడీస్ లండన్ ఒపినియన్, ఈస్టర్న్ వరల్డ్ మొదలైన పత్రికలకు అబ్రహాం అనే కలం పేరుతో కార్టూన్లు వేయడం ఆరంభించారు. 1956లో ట్రిబ్యూన్ పత్రికలో ప్రచురింపబడ్డ ఇతని రెండు కార్టూన్లను చూసి ప్రపంచంలో అతి పురాతనమైన ఆదివారం వార్తాపత్రిక ''ది అబ్జర్వర్'' సంపాదకుడు డేవిడ్ ఏస్టర్ ఆయనకు తన పత్రికలో రాజకీయ కార్టూనిస్టుగా స్థిరమైన ఉద్యోగాన్ని ఇచ్చారు. ఆయన సలహాపై అబ్రహాం అనే కలం పేరును తన చిన్ననాటి ముద్దుపేరు "అబూ"గా మార్చుకున్నారు. అబూ బ్రిటిష్ సంస్కృతిలో మునిగి పోయి వాడి, వేడి రాజకీయ కార్టూన్లను గీశారు. ది గార్డియన్ పత్రిక అబును "త్రికరణ శుద్ధిగా వామపక్ష భావ జాలాన్ని నమ్మి ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారైనాడని" అభివర్ణించింది. 1962లో శాతం క్యూబాలో చేగువేరా చిత్రాన్ని గీశారు. 1966 సెప్టెంబరులో అబూ ది గార్డియన్ పత్రికలో చేరారు. ట్రిబ్యూన్ పత్రికకు వారం వారం కార్టూన్లను వేశారు. 1968లో వియత్నాం యుద్ధంపై వెలువడిన "వర్డిక్ట్ ఆఫ్ వియత్నాం" అనే కార్టూన్ల సంకలనానికి సంపాదకత్వం వహించారు. అబూ 1969లో భారత దేశానికి తిరిగి వచ్చారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో 1981 వరకు రాజకీయ కార్టూనిస్టుగా పనిచేశారు. 1970లో ఆయన తీసిన షార్ట్ ఫిలిం నో ఆర్క్‌కు బ్రిటిష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ ప్రత్యేక అవార్డును ఇచ్చింది. 1972-78ల మధ్య ఇతడు రాజ్యసభలో నామినేట్ సభ్యుడిగా ఉన్నారు. 1975లో భారత అత్యవసర స్థితి విధించినపుడు పత్రికా స్వేచ్ఛను రద్దు చేశారు. అబూ ఈ చర్యతో ఇందిరా గాంధీ పై ఉన్న అభిమానాన్ని కోల్పోయారు. పత్రికా రంగంలో పని చేసే వారు కొంత మంది, ఎమర్జెన్సీ రోజులలో వంగమంటే, నేలన పడి పాకారని ఒక అపప్రథ ఉన్నది. అటువంటి చెడ్డపేరు, అబూ అబ్రహంకు గాని ఆయన పని చేసిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్సుకు గాని రాలేదు. ఆయన ధైర్యంగా ఉండి తన కార్టూన్లను తాను వేస్తూ, సెన్సార్ అధికారులకు అందకుండా, చాలా తెలివిగా కార్టూన్లు గీసి నెగ్గుకు వచ్చారు. ధైర్యం, నిబద్ధత ఉంటే ఎంతటి నియంత అయినా ఏమీ చెయ్యలేదని నిరూపించారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో ప్రచురించ లేక పోయిన రాజకీయ కార్టూన్లు, వ్యాసాలతో "గేమ్స్ ఆఫ్ ఎమర్జెన్సీ" అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఇంకా ఇతడు "అబూ ఆన్ బాంగ్లాదేశ్", "ప్రైవేట్ వ్యూ", "అరైవల్స్ అండ్ డిపార్చర్స్" అనే కార్టున్ పుస్తకాలను ప్రకటించారు. 1988లో వెలువడిన పెంగ్విన్ బుక్ ఆఫ్ ఇండియన్ కార్టూన్స్‌కు సంపాదకుడిగా ఉన్నారు. 1981 నుండి అబూ ఫ్రీలాన్సర్‌గా వివిధ వార్తా పత్రికలకు కార్టూన్లు గీయడం ప్రారంభించారు. "సాల్ట్ అండ్ పెప్పర్" అనే స్ట్రిప్ కార్టూన్ వేయ నారంభించారు. ఎంతో మందిని తన భావ యుక్తమైన కార్టూన్లతో కదిలించిన, ఈ ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు, 2002 సంవత్సరం డిసెంబరు 1 వ తేదీ మరణించారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా రాజ్యసభ రెండు నిమిషాల మౌనం పాటించింది. అబూ అంత్య క్రియలను ప్రభుత్వ లాంచనాలతో ఘనంగా నిర్వహించారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### - ఏబీవీపీ నాయకులు మారావేణి రంజిత్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ ప్రవేట్ పాఠశాలలపైన కఠిన చర్యలు తీసుకోవాలి జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ గారికి ఏబీవీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ మరియు జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు మాట్లాడుతు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ నిబంధనల కి విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ ల పేరుతో అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పాఠ్యపుస్తకాలను అమ్ముతూ, విద్యార్థుల తల్లిదండ్రులను అడ్మిషన్ ఫీజు పేరుతో లేకపోతే పాఠశాల సగం ఫిజు ఇప్పుడే చెలించాలి అని వేధిస్తూ విద్యార్థుల మరియు వారి తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటం ఆడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే 1994 సంవత్సరంలో ప్రభుత్వం తీసుక వచ్చిన జీవో నెంబర్ 1 ప్రకారం ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పనిచేయాలని చెప్పున్న వాటిని ఏ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పాటించకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ధనార్జనే ధ్యేయంగా డొనేషన్లు, స్పెషల్ ఫీజులు, బస్సు ఫీజు, యూనిఫామ్ ఫీజు, బుక్స్ ఫీజ్ అని వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మానసికంగానూ వేధిస్తూ అధిక ఫీజులు వసూలు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా 2009 లో వచ్చిన జీవో నెంబర్ 91 ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు టెక్నో, ఈ టెక్నో, డిజి, టాలెంట్, ఒలింపియాడ్ అనే బ్రాండ్ పేరుతో పాఠశాల వద్ద పాఠ్యపుస్తకాలను అమ్మొవద్దని ఉన్న కూడా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పట్టించుకోవడంలేదు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు, స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు గుర్తింపును రద్దుచేసి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో కోరుతున్నామన్నారు. లేని యెడల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని తెలిపారు ఈ కార్యక్రమం లో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు, ఏబీవీపీ వింగ్ విభాగ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, ఎస్ ఫ్ ఎస్ కన్వీనర్ లోపెల్లి రాజు, ఎనగందుల శ్రీనివాస్, అన్నల్దాస్ పవన్ పాల్గొన్నారు.



# వెదిర గ్రామంలో పత్తి విత్తన యంత్రం ప్రదర్శన

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ వారు సంయుక్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రామడుగు మండలంలోని వెధిర గ్రామంలో న్యూ మాటిక్ ప్లాంటర్ యంత్రం ద్వారా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి నాటే యంత్రం ను గ్రామంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా విత్తనాలను నాటడం వలన వరుసకు వరుస మధ్య దూరం 3 ఫీట్లు ఉంటుందని, మొక్కకు మొక్క మధ్య దూరం 15 సెంటీమీటర్లు ఉంటుందని ప్రదర్శనకు వచ్చిన రైతులకు అవగాహన తెలిపారు. ఈ పద్ధతి ఎక్కువగా చలక భూములకు, ఇసుక భూముల్లో అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా స్థానం హెడ్ మంజులత, కెవికె హెడ్ వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్తలు మధుకర్, మధుమోహన్ విజయ, అంజని అలాగే వ్యవసాయ అధికారులు టి సంపత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# పశువుల, కూరగాయల అంగడి వేలంపాటలు

**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి:** మండల కేంద్రం బెజ్జంకి లోని పశువుల అంగడి, కూరగాయల వారసంతలకు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను వేలం పాటలు శుక్ర వారం నిర్వహించ నున్నట్లు ప్రత్యేక అధికారి , ఎంపీడీవో లక్ష్మప్ప, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పశువుల అంగడికి ఇరవై వేల రూపాయలు, కూరగాయల వారసంతకు పన్నెండు వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాలి అని తెలిపినారు. ఈ వేలం పాటలు తొమ్మిది నెలల వరకే అనగా మార్చ్ నెల వరకు పరిమితం అని తెలిపినారు. వేలం పాటలు శుక్రవారం రోజున 10 గంటలకు గ్రామపంచాయతీ ఆవరణలో జరప బడునని వేలంపాటలలో పాల్గొన్నవారు ఎలాంటి బకాయిలు, గ్రామపంచాయతీకి ఉండరాదని స్పష్టం చేశారు. వేలం పాట దక్కించుకున్న వారు 50% అదే రోజు డబ్బులను చెల్లించాలని తెలిపినారు.

# ఓఆర్ఆర్ పై కారులో మంటలు



**శామీర్ పేట:** శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ పై కారులో అకస్మాత్తుగా మంటలు చెలిరేగాయి. మంగళవారం చెన్నయ్ నుంచి డిచ్ పల్లి కి వెళ్తున్న ఒ కార్ సాయంత్రం సమయంలో శామీర్ పేట ఓ ఆర్ ఆర్ కు చేరుకుంది. ఇంతలో ఒక్కసారిగ కార్ నుంచి పొగలు రావడం తో కార్ లో ఉన్న వ్యక్తులు కార్ను నిలిపివేసి బయటకు వచ్చారు. కాగా ఒక్కసారిగ కార్ లో మంటలు చెలరేగాయి దీంతో కార్ మొత్తం దగ్ధం అయ్యింది. విషయం తెలిసిన శామీర్ పేట పోలీసులు సంఘటనన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలోఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

# సామాజిక బాధ్యతగా ఉచితవైద్య శిబిరాలు

### - మెడికవర్ ఆసుపత్రి ప్రధాన డాక్టర్ గుర్రం కిరణ్

**జగిత్యాల:** సామాజిక బాధ్యతగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్యాన్ని చేరువ చేస్తున్నామని ఆసుపత్రి ప్రధానవైద్యులు గుర్రం కిరణ్ అన్నారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి, జగిత్యాల నాయి బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆద్వర్యంలో మంగళవారం నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులకు ఉచిత గుండె వైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిభిరంలో 120 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. ఆసుపత్రి గుండె వైద్యులు డాక్టర్ రామనాథం, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు అందించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి సెలవులతో సంబంధం లేకుండా రాత్రి పగలనే తేడా లేకుండా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పెండెం మహేందర్, ఉపాధ్యక్షులు మద్రిపెల్లి గంగరాజం, కార్యదర్శి రాచమల్ల శ్రీనివాస్, జాయింట్‌సెక్రటరీ మద్రిపల్లి సాగర్, కోశాధికారి రాచర్ల శ్రీనివాస్, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, చంద్రశేఖర్, సాయితేజ, సిబ్బంది పాల్గొన్నారు.



# డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయురాలు డా. సదాలక్ష్మిని అభినందించిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

### - ఉత్తమ సేవలకు దక్కిన గౌరవం

**జగిత్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న అనంతల సదాలక్ష్మి (తాటికొండ లక్ష్మీ నాగయ్య) కు డాక్టరేట్ లభించడం పట్ల జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష , జిల్లా విద్యాధికారి బి జగన్ మోహన రెడ్డి అభినందనలు తెలిపారు. సామాజిక సేవా రంగాలలో అనేక ఏళ్లుగా నిస్వార్ధంగా ఆమె అందిస్తున్న సేవలకు గాను ఢిల్లీలోని హోటల్ సరోవర్ లో ఈనెల 8వ తేదీన వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎల్లో ఎచీవర్స్ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ ప్రముఖుల చేతుల మీదుగా సదాలక్ష్మికి డాక్టరేట్ ప్రధానం చేశారు.



## నీట్ పవిత్రత దెబ్బతింది..

# మాకు సమాధానం కావాలి




న్యూఢిల్లీ: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్‌పై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ప్రశ్నాపత్రం లీకయిన కారణంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) అండర్‌గ్రాడ్యుయేట్(యుజి) పరీక్ష–2024ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) మే 5వ తేదీన నీట్–యుజి పరీక్షను నిర్వహించింది. జూన్ 4న పరీక్షా ఫలితాలు వెలువడడంతో పరీక్షల్లో విజేతలైన అభ్యర్థులకు ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుష్, సంబంధిత ఇతర కోర్సులలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం కౌన్సిలింగ్ ప్రారంభం కావలసి ఉంది. నీట్ పరీక్ష లీకైందని, దీనిపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ శివంగి మిశ్రాతోపాటు ఇతర వైద్య ప్రవేశ ఆశావహులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎ అమానుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ కేంద్రానికి, ఎన్‌టిఎకి నోటీసులు జారీచేసింది. నీట్ 2024 పరీక్షను రద్దు చేయాలని మిశ్రా తన పిటిషన్‌లో అర్థించగా అది అంత సులభం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. నీట్ పరీక్షను పరమ పవిత్రంగా చేశారని, ఇప్పుడు దాని పవిత్రత దెబ్బతిందని, ముందుగా తమకు సమాధానాలు కావాలని జస్టిస్ అమానుల్లా ఎన్‌టిఎ తరఫు న్యాయవాదికి తెలిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే కౌన్సిలింగ్ నిలుపుదల కోసం కోరగా అందుకు ధర్మాసనం తిరస్కరించింది. కౌన్సిలింగ్‌ను ఆపే ప్రసక్తి లేదని, ఇదే విధంగా వాదిస్తే పిటిషన్‌ను కొట్టివేస్తామని పిటిషనర్ తరఫు న్యావాదిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, నీట్–యుజి 2024 ఫలితాల ప్రచురణపై స్టే విధించడానికి చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ మే 17న నిరాకరించారు. ఇందుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌కు జవాబు ఇవ్వాలని కేంద్రానికి, ఎన్‌టిఎకు నోటీసులు జారీచేసిన సిజెఐ ఈ కేసు విచారణను జులైకు వాయిదా వేశారు. ఇప్పుడు ఈ రెండు పిటిషన్లపై విచారణ జరుగుతుంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాథ్యూస్ నెడుంపరా వాదిస్తూ నీట్ యుజి అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిలిపివేయాలని కోరారు. దీన్ని తిరస్కరించిన ధర్మాసనం కౌన్సిలింగ్ ప్రారంభం కావలసిందేనని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ వల్ల నిజాయితీగా పరీక్షను రాసిన అభ్యర్థులు నష్టపోగా కొందరు అభ్యర్థులు లబ్ధిపొందారని పిటిషనర్లు వాదించారు.

# ఇక దేశవ్యాప్తంగా సంస్థాగత మార్పులు




న్యూఢిల్లీ: కేంద్రంలో బిజెపి సారథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా కమలం పార్టీ ఇక సంస్థాగత మార్పులపై దృష్టి సారించనున్నది. మొదట దేశవ్యాప్తంగా సభ్యత నమోదును చేపట్టి ఆ తర్వాత రాష్ట్రాలలో అంతర్గత ఎన్నికలను పూర్తి చేసి ఆ తర్వాత రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల ఎన్నికలను నిర్వహించనున్నది. బిజెపి ప్రస్తుత అధ్యక్షుడు జెపి నడ్డా పదవీకాలం జూన్ 30తో ముగియనున్నది. కాగా..అత్యవసర పరిస్థితులలో అధ్యక్షుడు పదవీ కాలానికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని పార్టీ అత్యున్నత విభాగం పార్లమెంటరీ బోర్డుకు అప్పగిస్తూ బిజెపి నియమావళిలో ఇటీవల సరవణలు తీసుకువచ్చారు. తన స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక పూర్తయ్యేవరకు నడ్డాను కొనసాగిస్తూ పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. అయితే తుది నిర్ణయం పార్టీ అగ్రనేతలపైనే ఆధారపడి ఉంటుందని వారు చెప్పారు. నడ్డాను కేంద్ర ఆరోగ్య, రసాయనాలు, ఎరువుల శాఖలను కేటాయించడంతో ఆయన వారసుడి కోసం అన్వేషణ పార్టీలో మొదలైంది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి అధ్యక్షుడిగా అమిత్ షా ఉన్నారు. ఆయన కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన స్థానంలో నడ్డాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ నియమించింది. అనంతరం 2020 జనవరిలో ఆయన పూర్తికాలం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ కొత్త సాంప్రదాయాన్ని అనుసరించే ఇప్పుడు కూడా పూర్తికాలం అధ్యక్షుడి నియామకం జరిగే వరకు వర్కింగ్ ప్రెసిడెంట్‌ను నియమించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ప్రధాని నరేంద్ర మోడీ 2019లో రెండవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు పార్టీ సంస్థాగత వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారన్న ఆలోచనతోనే నడ్డాను తన మంత్రివర్గం నుంచి తప్పించారు. అయితే పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయగల అనుభవజ్ఞులైన సీనియర్ నాయకులు ఇప్పుడు కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టడంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక పార్టీ నాయకత్వానికి సవాలుగా మారింది. పార్టీకి సారథ్యం వహించగల సమర్థులుగా భావించిన ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్ తాగాజా మోడీ ప్రభుత్వంలో మంత్రి పదవులు చేపట్టారు. దీంతో రాష్ట్రాలకు చెందిన నాయకులనో లేక జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఒకరినో పార్టీ అధ్యక్ష పదవికి ఎంపిక చేసే అవకాశం కనపడుతోంది. కొందరు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వంలో చోటు దక్కించుకోవడం, ఉత్తర్ ప్రదేశ్ వంటి కీలక రాష్ట్రంలో పార్టీకి ఇటీవలి ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడంతో రాష్ట్ర అధ్యక్షులుగా కొత్త వారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది. పశ్చిమ బెంగాల్ బిజెపి అధ్యక్షుడు సుకాంత మజుందార్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బీహార్ బిజెపి అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని రాష్ట్రంలో పారీ సారథిగా కూడా ఉన్నారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిపి జోసి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో సామాజిక సమతుత్యత కోసం అక్కడ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ఉత్తర్ ప్రదేశ్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి తగిలిన ఎదురుదెబ్బ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భూసేంద్ర సింగ్ చౌదరిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంపై దృష్టంతా నిమగ్నం చేయడంతో సంస్థాగత ఎన్నికలను, మార్పులను తాత్కాలికంగా పార్టీ పక్కనపెట్టినట్లు వర్గాలు తెలిపాయి. ఇప్పుడు మోడీ 3.0 కూడా కొలువుదీరిన నేపథ్యంలో వెంటనే సంస్థాగత వ్యవహారాలపై పార్టీ అగ్ర నాయకత్వం దృష్టి సారించనున్నట్లు వారు చెప్పారు. లోక్‌సభలో బిజెపి మెజారిటీని కోల్పోయినప్పటికీ ఎన్‌డిఎ మిత్రపక్షాలతో కలసి 272 మెజారిటీ మార్కును సులభంగానే దాటేసింది.

# జులై 1న ఒక్కొక్కరికి 7 వేలు ఫించన్

## ఏపీ కొత్త సర్కార్ కసరత్తులు షురూ..!


**అమరావతి:** ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. వీరి విజయానికి ఎన్నికలకు ముందు కూటమి ప్రకటించిన ఉమ్మడి మేనేఫెస్టో కూడా ఒక కారణం. అందులో ఫించన్ల పెంపు అంశం సామాన్యుడిని అమితంగా ఆకర్షించిందని ప్రత్యేకగా చెప్పనవసరం లేదు. వృద్ధాప్య పింఛన్ 4వేలు, దివ్యాంగులకు 6వేలకు పెంచుతామని హామీనిచ్చాయి. ఏప్రిల్ నెల నుంచే పెరిగిన సామాజిక భద్రత పింఛన్లను అందిస్తామని హామీ ఇచ్చింది. పెరిగిన పింఛన్ జులై 1వ తేదీన అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 65.30 లక్షల మంది పింఛను లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు పింఛను నగదు చెల్లింపులకుగాను నెలకు 1,939 కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తూ వచ్చింది. ఏప్రిల్ నుంచే 4వేల పింఛను పెంపు అమలు చేస్తే ఒక్కొక్కరికి 7వేల చొప్పున జులై 1న పింఛను పంపిణీ చేయవల్సి ఉంటుంది. పెరిగిన పింఛను 4 వేలుతోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు 1000 చొప్పున 3వేలు మొత్తం కలిపి వచ్చే నెలలో ఒక్కొక్కరికి 7 వేలు పంపిణీ చేయనున్నారు. మరోవైపు దివ్యాంగులకు 6 వేల చొప్పున పింఛను జులై 1న పంపిణీ చేయడానికి 4,400 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆగస్టు నుంచి అయితే నెలకు రూ.2,800 కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టిన అధికారులు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. దివ్యాంగ పింఛనుదారులు రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం రూ.3 వేలు పింఛను అందిస్తున్నారు. వీరి పింఛనును రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు.

పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15 వేలు, కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేల పింఛను అందిస్తామని కూటమి మేనేఫెస్టోలో పేర్కొంది. వీరందరి వివరాలను వైద్యశాఖ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సేకరిస్తున్నారు.

## మలేరియా వ్యతిరేక మాసోత్సవం పై అవగాహన కార్యక్రమం

**మద్దికేర:** మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారిణులు డాక్టర్ శ్రీలక్ష్మి,డాక్టర్ రాగిణి ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఆశాడే కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు మాతా శిశు మరణాలు నివారించడానికి గర్భవతులకు ఫోన్ నెంబర్లను సేవ్ చేయించాలని,మెసేజ్లను వినిపించాలని మరియు మాత శిశు ఆరోగ్య సేవలపై అవగాహన పెంచాలని తెలియజేశారు. అధిక ప్రమాద సంకేతాలు ఉన్న గర్భవతులను మరియు రక్తహీనత గల గర్భవతులను గుర్తించి తగిన చికిత్స వైద్యాధికారులచే అందజేయాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరం లోపల పిల్లలు ఉన్న వారికి అతిసార, విరేచనాలు నివారణకు కృషి చేయాలని వారు తెలియజేశారు. అనంతరం ప్రతి సంవత్సరం జూన్ మాసంలో నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై ఆశా కార్యకర్తలకు అవగాహన కలిగించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

# నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం



హైదరాబాద్: జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నట్లు రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన పాఠశాలల పునఃప్రారంభం సహా పలు అంశాలపై కొత్తగూడెం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పేద పిల్లలకు మంచి విద్య అందించే లక్ష్యంతో అమ్మ ఆదర్శ పాఠశాలలు పనిచేస్తాయని మంత్రి చెప్పుకొచ్చారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. "రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం విద్యతోపాటు ఇంగ్లీష్ మీడియం కూడా అందిస్తున్నాం. కళాశాల విద్యకూ పెద్దపీట వేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైంది. రూ.39వేల కోట్లతో మిషన్ భగీరథ పథకం ప్రారంభించినా.. జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు వాటర్ సప్లై అధ్వానంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకాన్ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం. ధరణిపై కమిటీ నివేదిక త్వరలో రానుంది, అందులోని ఇబ్బందికర అంశాలను తొలగించి, పెండింగ్‌లో ఉన్న 2.55లక్షల దరఖాస్తులు పరిష్కరిస్తాం. విత్తనాలు అందుబాటులో లేవని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. మేలైన ఒకే రకం విత్తనాలపై ప్రచారం చేసి కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రైతులను బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురి చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్‌ఉండదంటూ దుష్ప్రచారాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పవర్ కట్ అనే సమస్యే లేదు. ప్రభుత్వ స్థలాలను ఏ స్థాయి వ్యక్తులు కబ్జా చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు మూసుకొని ఉండదు" అని హెచ్చరించారు.

# భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- తెలంగాణ జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్
- ఘనంగా తెలంగాణ ఉద్యన విశ్వవిద్యాలయం మూడవ  స్నాతకోత్సవం




**సిద్దిపేట:** 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు లో జూన్ 11వ తేదీన జరిగిన కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ. భారత స్థూల జాతీయోత్పత్తికి 18% పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70% పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక తిరిగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. పెద్దగా ఆలోచించాలని వాటిని చేరుకునేందుకు ఆరంభం సైతం చేరువ అంతే పెద్దగా ఉండాలని అన్నారు. ప్రపంచంలో అబ్రహం లింకన్, నరేంద్ర మోడీ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారని, పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని గవర్నర్ పేర్కొన్నారు. చదువుతో సహా ప్రతి అంశంలో నాణ్యతను చూపించినట్టయితే విజయం తథ్యమని అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు. తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత అలాగే పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతోపాటు సూ ర్ ఎకానమిక్ పవర్ గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి. గీతాలక్ష్మి అన్నారు. స్నాతకోత్సానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ. ప్రెసిషన్ ఫామింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేదస్సు, రోబోట్స్, డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాని ద్వారా పంటల ఉత్పాదకత పెరుగుతుందని ఆమె అన్నారు. పంట కోతనంతరం 20 నుంచి 30 శాతం దిగుబడి నష్టం జరుగుతున్న నేపథ్యంలో, పంట ఉత్పత్తుల మేలైన నిల్వలకు కావాల్సిన సదుపాయాల్ని కల్పించుకోవాలని అన్నారు. స్పీడ్ బ్రేకింగ్ ఉంటాయి ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ వ్యవధి ఉండే నూతన రకాల అభివృద్ధి రెండు మూడు సంవత్సరాల్లోనే పూర్తవుతుంది అన్నారు. జీన్ ఎడిటింగ్, జీన్ పిరమిడ్ పద్ధతుల ద్వారా చలిని, అధిక వేడిని, నీటి ఎద్దడిని తట్టుకునే పంట రకాల రూపకల్పన సుసాధ్యమని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని డాక్టర్ గీతా లక్ష్మి పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయ, ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు పుష్కల భవిష్యత్తు ఉన్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలని నైపుణ్యభారత్ కు సైతం ఇది దోహదం చేస్తుందని ఆమె తెలిపారు. కష్టపడే లక్షణం విద్యార్థులు అలవర్చుకుంటే విజయం తప్పక వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ శ్రీమతి బి. నీరజ ప్రభాకర్ స్వాగత ఉపన్యాసం, అలాగే అభివృద్ధి నివేదికను గవర్నర్ కు విన్నవించారు. మేలైన ఉద్యాన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందిస్తుందని, అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆమె తెలిపారు. తెలంగాణలో రైతులు సాగు చేస్తున్న బాలనగర్ సీతాఫలం, ఆర్మూరు పసుపు తోపాటు మరికొన్ని స్థానిక పంటలకు భౌగోళిక గుర్తింపు, రైతు వంగడాల రిజిస్ట్రేషన్, పామ్ ఆయిల్ పై పరిశోధనలు, ప్రధాన ఉద్యాన పంటల్లో సేంద్రీయ సాగు, నూతన రకాల అభివృద్ధి ఆమె తెలిపారు. రైతులకు శాస్త్రీయతతో కూడిన ఉద్యాన దర్శిని ప్రచురణతో పాటు గ్రామాల దత్తత, విస్తరణ కార్యక్రమాల ద్వారా రైతులకు నూతన ఉద్యాన పరిజ్ఞానాన్ని అంద అందజేస్తున్నట్లు డాక్టర్ నీరజ ప్రభాకర్ తెలిపారు.

**విద్యార్థులకు బంగారు పతకాల ప్రధానం..**

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్ లో అత్యధిక ఓజిపిఏ సాధించినందుకు గాను 2023 బ్యాచ్ కు చెందిన ఆర్, వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బిఎస్సి హానర్స్ ఫారెస్ట్రీలో పిసిసిఎఫ్ గోల్డ్ మెడల్ కె. రవళి,గోల్డ్ మెడల్ కె. ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్ లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఎస్కేఎల్ టి ఎస్ హెచ్ గోల్డ్ మెడల్, అలాగే విద్యార్థినిలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, ఇంకా కూరగాయల విభాగంలో టాపర్గా నిలిచినందుకుగాను గాను ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జిఎస్ దివ్య, పూల శాస్త్ర విభాగంలో పీ. విద్య శ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

**విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం....**

ఈ మూడవ స్నాతకోత్సవంలో 156 మంది కి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆర్గుకి పీహెచ్డ్ డాక్టరేట్ పట్టాలు ప్రధానం.